
మన అంకుశం

అవినీతిపై అక్షర సమరం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 68 | బుధవారం 20 మే 2026 | పేజీలు : 4 | వెల : 3/-


# గుర్తుకొస్తున్నాయి.. గుర్తుకొస్తున్నాయి

## చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న సీఎం చంద్రబాబు

## కుప్పంలో గంగమ్మ జాతరకు వెళ్లి వస్తూ తాటి ముంజలు తిన్న సీఎం దంపతులు

**(అంకుశం, కుప్పం, మే 20):**

కుప్పంలో ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ముఖ్యమంత్రి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సీఎం దంపతులకు పూర్ణ కుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. సంప్రదాయ పద్ధతుల్లో ప్రసన్న తిరుపతి గంగమ్మకు పట్టు వస్త్రాలను, తిరుమల వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని సమర్పించిన సీఎం దంపతులు. తిరుపతి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా భువనేశ్వరి. కుప్పంలో ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం తిరుగు ప్రయాణంలో ముఖ్యమంత్రి దంపతులు తంజమ్మకొట్టాలు వద్ద ఆగారు. కల్లుగీత కార్మికులు తాటిముంజలు తీస్తుండగా కాన్వాయ్‌ను నిలిపి వారి వద్దకు వెళ్లిన సీఎం చంద్రబాబు దంపతులు...ముంజలు తీసి ఇవ్వండి... రుచి చూస్తాం అని అడిగారు. కార్మికులు అందించిన తాజా తాటిముంజలను సీఎం దంపతులు రుచి చూశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులతో ముఖ్యమంత్రి కాసేపు ఆత్మీయంగా సంభాషించారు. వారి పనితీరు, కుటుంబ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.









# మంత్రి కొండపల్లిని కలిసిన ఎస్కేయు ప్రతినిధులు

## -- పలు కొత్త స్టార్టప్‌లపై చర్చ



**(అంకుశం, విజయవాడ, మే 20):**

రాష్ట్రంలో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధిని ప్రోత్సహించడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవా సాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ -- శ్రీ కృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయం (ఏఐసీ ఎస్కేయూ) సీఈఓ డాక్టర్ సి. చంద్రమౌళి, డాక్టర్ పి. జ్యోతి మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఏఐసీ ఎస్కేయూ చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలపై వారు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ఇంక్యుబేషన్ సెంటర్ ఇప్పటివరకు 70 కి పైగా స్టార్టప్‌లను ప్రోత్సహించడంతో పాటు 50 ఉన్నత

- మిగతా2లో

# ఎరువుల అక్రమాలపై ఉక్కుపాదం

## ఎరువులను పక్కదారి పట్టిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు

## ప్రత్యేక తనిఖీలు, విజిలెన్స్ నిఘా పెంపుకు ఆదేశాలు

## వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**(అంకుశం, అమరావతి, మే 20):**

రాష్ట్రంలో రైతులకు అందాల్సిన ఎరువులను అక్రమంగా పక్కదారి పట్టించడం, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించడం, బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, ఇతర ప్రాంతాలకు తరలింపు వంటి వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులకు సరైన సమయంలో నాణ్యమైన ఎరువులు అందకుండా కొరత సృష్టించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని మంత్రి ఘాటుగా హెచ్చరించారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, ఇతర రాష్ట్రాలకు తరలించడం, పరిశ్రమలకు మళ్లించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే డీలర్లు, మధ్యవర్తులు, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల డీలర్లు,

- మిగతా2లో

# హస్త కళారూపాలు.. వినియోగదారుల ఇళ్లకే డోర్ డెలివరీ

## లేపాక్షి షో రూమ్ లకు నూతన హంగులు

## ఏపీహెచ్డీసీ అధికారులతో సమీక్షలో మంత్రి సవిత



**(అంకుశం, అమరావతి, నవంబర్ 20):**

లేపాక్షి షో రూమ్ లను అభివృద్ధి చేయడంతో పాటు ఈ కామర్స్, సోషల్ మీడియా వేదికగా కళారూపాలను నేరుగా వినియోగదారుల ఇళ్లకే డోర్ డెలివరీ చేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. హస్త కళాకారులకు 365 రోజుల పాటు ఉపాధి కల్పనే కూటమి లక్ష్యమని స్పష్టం చేశారు. లేపాక్షి షోరూమ్ లు, హస్తకళా రూపాల విక్రయాలపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ హస్త్రకాఫ్టస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీహెచ్డీసీ) అధికారులతో బుధవారం మంత్రి సవిత సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఎండీ విశ్వ, ఇతర అధికారులు పాల్గొని, రాష్ట్రంలో నూతన లేపాక్షి షో రూమ్ ల ఏర్పాటుతో పాటు ప్రస్తుతమున్న షో రూమ్ లను వినియోగదారులకు ఆకట్టుకునేలా అభివద్ధి చేసే అంశాలపై మంత్రి సవితకు వివరించారు. మరమ్మతులు పూర్తిచేసుకున్న ఢిల్లీ, కాకినాడ లేపాక్షి షో రూమ్ లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, మరమ్మతులు పూర్తి చేసుకున్న లేపాక్షి షో రూమ్ లను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. రాజమండ్రి ఎయిర్ పోర్టులో నూతన లేపాక్షి షో రూమ్ ఏర్పాటుకు కేంద్ర విమానయాన శాఖ అంగీకారం తెలిపిందని, త్వరగా ఆ షో రూమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని లేపాక్షి షో రూమ్ లను నూతన హంగులతో వినియోగదారులకు ఆకట్టుకునేలా అభివద్ధి చేయాలన్నారు. ఈ కామర్స్ ద్వారా హస్త కళారూపాల అమ్మకాలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా వేదికను హస్త కళారూపాల విక్రయాలకు అవకాశంగా వాడుకోవాలన్నారు. నేరుగా వినియోగదారుల ఇళ్లకే కళారూపాలను డోర్ డెలివరీ చేసేలా ఈ కామర్స్ వేదికలను వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే ఆప్కో షో రూమ్ ల ద్వారా చేనేత వస్త్రాలను డోర్ డెలివరీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న హస్త కళాకారులకు ఏడాది పాటు ఉపాధి కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు నేతత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా హస్త కళారూపాల అమ్మకాలు పెంచేలా అధికారులు ప్రణాళికలు అమలుచేయాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హస్త్రకాఫ్టస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక తుపాను రాబోతుంది

దేశ రాజ్యాంగంపై నిరంతరాయంగా దాడులు జరుగుతున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని బలహీనపరిచే కుట్రలు సాగుతున్నాయని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్ రాయ్‌బరేలీలో జరిగిన బహుజన్ స్వాభిమాన్ సభలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. భారత రాజ్యాంగం అనేది కేవలం ఒక సాధారణ పత్రం కాదని, అది డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ సిద్ధాంతాలకు సజీవ రూపమని తెలిపారు. మహనీయులను స్మరించుకుంటున్నామే తప్ప, వారు నమ్మిన సిద్ధాంతాలను సరిగ్గా కాపాడుకోలేకపోతున్నామని చెప్పారు. మహనీయుల విగ్రహాల ముందు తలలు వంచడం పెద్ద ఫ్యాషన్‌గా మారిందని, కానీ అదే మహనీయులు రాసిన రాజ్యాంగంపై, వారు నమ్మిన సిద్ధాంతాలపై దాడులు జరుగుతుంటే మాత్రం అందరూ మౌనంగా ఉంటున్నారని మండిపడ్డారు. రాజ్యాంగంపై ప్రధాని మోదీ రోజు దాడి చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం, దేశంలో కుల గణన చేపట్టకపోవడం ఇందులో భాగమేనన్నారు. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి అంబానీ, అదానీ వంటి పెద్ద పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకే కేంద్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తోందని రాహుల? గాంధీ దుయ్యబట్టారు.

"ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశాలకు వెళ్లొద్దు, బంగారం కొనొద్దు, ఎలక్ట్రిక్ వాహనాలు కొనండి అని చెప్తున్నారు. ఆయనే స్వయంగా వేల కోట్ల రూపాయల విలువైన విమానాల్లో విదేశీ పర్యటనలకు వెళ్తున్నారు. రాబోయే రోజుల్లో రైతులకు ఎరువులు కూడా దొరకని పరిస్థితి రానుంది. ఆర్థిక తుపాను రాబోతుంది. మీరే చూడండి. రానున్న కొద్ది నెలల్లో ద్రవ్యోల్బణం ఎక్కడికి చేరుతుందో. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పప్పుధాన్యాలు, బియ్యం ధరలు



ఎక్కడికి చేరుతాయో మీరే చూడండి. ఎన్నికలకు ముందు దేశంలో పెట్రోల్, గ్యాస్ కొరత ఏమీ లేదని ప్రధాని చెప్పారు. పెట్రోల్ ధరలు పెరగవన్నారు. ఈరోజు పెట్రోల్ ధరలు పెరుగుతుంటే అంబానీ మాత్రం భారతదేశం నుంచి విదేశాలకు పెట్రోల్‌ను ఎగుమతి చేస్తున్నారు. అంబానీ రష్యా నుంచి పెట్రోల్‌ను కొనుగోలు చేసి విదేశాల్లో విక్రయిస్తున్నారు. ఆ డబ్బుతోనే ప్రధానికి నిధులు సమకూరుస్తున్నారు."

**'అలా చేయకుండా మెలోనితో కలిసి చాక్లెట్లు తిని వీడియోలు చేశారు'**

మరోవైపు ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోనికి ప్రధాని మోదీ మెలోడి చాక్లెట్లు ఇవ్వడంపైనా రాహుల్? స్పందించారు. ప్రజల రక్షణ కోసం చర్యలు తీసుకోవాల్సిన ఆయన, ఇటలీ ప్రధానితో చాక్లెట్లు తిని వీడియోలు తీశారని ఎద్దేవా చేశారు. అమేఠీలో నిర్వహించిన సభలో మాట్లాడిన ఆయన ఈ మేరకు ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. "మనకు చమురు హర్మూజ్ జలసంధి గుండా వస్తుంది కానీ ఇప్పుడు దానిని మూసివేశారు. అయినా, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు చమురు, గ్యాస్, పెట్రోల్ కొరత లేదని, అంతా బాగానే ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. గత రెండు నెలలుగా పార్లమెంటులోనూ, ప్రసంగాల్లోనూ ఒక ఆర్థిక తుఫాను రాబోతోందని నేను నెలల తరబడి చెబుతూనే ఉన్నాను. దీని వల్ల రైతులు, కార్మికులు, యువత, సోదరీమణులు తీవ్రంగా నష్టపోబోతున్నారు. ఇలా చెబితే బీజేపీ నాయకులు నన్ను ఎగతాళి చేస్తున్నారు. ప్రజలను రక్షించడానికి, వారికి ఆర్థిక రక్షణ కవచం కోసం నరేంద్ర మోదీ గత మూడు నెలలుగా చర్యలు తీసుకోవాల్సింది. కానీ ఆయన అలా చేయలేదు. దానికి బదులుగా ఆయన ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనితో కలిసి చాక్లెట్లు తిని వీడియోలు చేశారు." అని రాహుల్ గాంధీ అన్నారు.

"ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనిని కలవడానికి వెళ్లే ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత ప్రజలతో ఒక ఆర్థిక తుఫాను రాబోతోందని చెప్పారు. ప్రజలు పెట్రోల్ తక్కువగా వాడాలని, బంగారం కొనవద్దని, తక్కువ ఖర్చు చేయాలని, విదేశాలకు ప్రయాణించడం మానుకోవాలని అన్నారు. కానీ, కేవలం ఒక్క రోజు తర్వాత మోదీ తన జేబులో చాక్లెట్లు పెట్టుకుని రూ. 3,000-4,000 కోట్ల విలువైన విమానం ఎక్కి ఇటలీకి వెళ్లారు. అక్కడ ప్రధానమంత్రికి మెలోని చాక్లెట్ ఇచ్చారు. ఈ దేశ ప్రజలను ఏ విధంగా అపహాస్యం చేస్తున్నారో ఇప్పుడు చూడండి. పెట్రోల్, గ్యాస్ కొరత ఉంది. వ్యాపారాలు, ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతోంది, రైతులకు ఎరువులు అందడం లేదు, మొత్తం పారిశ్రామిక వ్యవస్థ కుప్పకూలుతుంది. 'పెద్ద నోట్ల రద్దు తర్వాత నల్లధనాన్ని నిర్మూలించకపోతే నన్ను ఉరితీయండి' అని నరేంద్ర మోదీ అన్నారు. మీకు గుర్తుందా? ఆయన చేతులు జోడించి ఏడుస్తూ ఆ మాట అన్నారు. కొవిడ్ సమయంలో లాక్‌డౌన్ విధించారు, కార్మికులు నష్టపోయారు, రైతులు నాశనమయ్యారు. ఇప్పుడు మరోసారి చేతులు జోడించి ఏడ్చే సమయం వస్తోంది." అని రాహుల్ గాంధీ అన్నారు.

# ఏఐఏడీఎంకే మద్దతు తీసుకోవద్దు

తమిళనాట విజయ్ నేతృత్వంలోని టీవీకే సర్కార్‌కు ఆదిలోనే తీవ్ర అడ్డంకులు ఏర్పడుతున్నాయి. టీవీకే సర్కార్ ఒకవేళ ఏఐఏడీఎంకే మద్దతు స్వీకరించినా లేదా ఆ పార్టీని మంత్రివర్గంలో చేర్చుకున్నా, తాము వెలుపల నుంచి ఇస్తున్న మద్దతును పునఃసమీక్షించుకోవాల్సి ఉంటుందని సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం హెచ్చరించారు. మంగళవారం తిరువారూర్ జిల్లా తిరుతురైపూండిలో విలేకరులతో మాట్లాడిన షణ్ముగం, రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వాన్ని కాపాడటానికి మాత్రమే విజయ్ సర్కార్?కు మద్దతు ఇచ్చామని తెలిపారు. గవర్నర్ పాలన పేరుతో దొడ్డిదారి గుండా బీజేపీ అధికారంలోకి రాకుండా నిరోధించడానికే తాము టీవీకేకు అండగా నిలిచామని పేర్కొన్నారు. "108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే హక్కు ఉంది. అందుకే బీజేపీ ప్రభుత్వం గవర్నర్ పాలన పేరుతో ఇక్కడ దొడ్డిదారిన పాలన చేయకూడదని మేము భావించాం. తమిళనాట మళ్లీ ఎన్నికలు జరగకూడదనే ఉద్దేశంతోనే మేము విజయ్ సర్కార్?కు మద్దతు ఇచ్చాం" అని అన్నారు.

"తమిళనాడులో ప్రత్యామ్నాయ పరిపాలన అందిస్తామనే వాగ్దానంతో విజయ్ అధికారంలోకి వచ్చారు. కాబట్టి ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఏఐఏడీఎంకే)ను ప్రభుత్వంలో భాగం చేయడం సరికాదు. ప్రజలు ఏఐఏడీఎంకే, డీఎంకే పార్టీలకు ప్రత్యామ్నాయంగా టీవీకేకు ఓటు వేశారు. అలాంటి పార్టీల మద్దతును ఇప్పుడు టీవీకే స్వీకరించడం లేదా వారిని మంత్రివర్గంలో చేర్చుకోవడం అనేది ప్రజా తీర్పునకు, వారి ఆశయానికి పూర్తిగా వ్యతిరేకం." అయితే అధికార పార్టీ ఆ దిశగా అడుగులు వేయదని తాము ఆశిస్తున్నట్లు పి.షణ్ముగం పేర్కొన్నారు. కానీ ఒక వేళ ఏఐఏడీఎంకే మద్దతు తీసుకోవాలనే నిర్ణయమే తీసుకుంటే, తాము ఇస్తున్న మద్దతును సమీక్షించుకోవడానికి వామపక్ష పార్టీలు సిద్ధంగా ఉంటాయని ఆయన



హెచ్చరించారు. ఇక ఏఐఏడీఎంకే అంతర్గత పరిణామాలపై స్పందిస్తూ, ఆ పార్టీలో వర్గ పోరాటాలు కొత్తేమీ కాదని అన్నారు. వాటిని ప్రజల సంక్షేమంతో సంబంధం లేని అంతర్గత విషయాలుగా షణ్ముగం అభివర్ణించారు.

ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో భాగంగా సీపీఐ(ఎం), సీపీఎంలు పోటీ చేసి, చెరో రెండేసి స్థానాలను గెలుచుకున్నాయి. మరోవైపు విజయ్ టీవీకే పార్టీ 108 స్థానాల్లో జయకేతనం ఎగురవేసి, అతిపెద్ద పార్టీగా నిలిచింది. అయితే మ్యాజిక్ ఫిగర్?కు 10 స్థానాల దూరంలో నిలిచిపోయారు. దీనితో అక్కడ గవర్నర్ పాలన గానీ, మళ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు గానీ ఉన్నాయనే వార్తలు వచ్చాయి. మరోవైపు డీఎంకే, ఏఐఏడీఎంకేలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయనే రూమర్స్ కూడా వచ్చాయి. అయితే డీఎంకే కూటమి నుంచి అనూహ్యంగా కాంగ్రెస్ బయటకు వచ్చి విజయ్?కు మద్దతు ఇచ్చింది. తర్వాత సీపీఐ(ఎం), వీకేసీ, ఐయూఎంఎల్ తదితర పార్టీలు ఆయను మద్దతు ప్రకటించాయి. దీనితో విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇక ఫ్లోర్ టెస్ట్ సమయానికి ఏఐఏడీఎంకే నుంచి గెలిచిన కొందరు ఎమ్మెల్యేలు కూడా విజయ్?కు సపోర్ట్ చేయడం గమనార్హం.

**వీసీకే, ఐయూఎంఎల్‌కు ఆహ్వానం**

మరోవైపు రాష్ట్రమంత్రివర్గంలో చేరాలని తమిళనాడు ప్రజా పనులు, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి అధవ్? అర్జున బుధవారం వీసీకే, ఐయూఎంఎల్? పార్టీలకు ఆహ్వానం పలికారు. ఎలాగైనా అధికారంలోకి రావాలనే లక్ష్యంతో డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీలు పరస్పరం చేతులు కలిపి, టీవీకీ సర్కార్ ఏర్పడకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించాయని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి విజయ్? తన మంత్రివర్గం ఒకే కుటుంబంలా పనిచేయాలని ఆశిస్తున్నారని, వామపక్ష పార్టీలను కూడా తన మంత్రివర్గంలో చేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారని అధవ్ అర్జున పరోక్షంగా సూచించారు.

**మంత్రివర్గంలో చేరికపై ఆలోచిస్తాం!**

మరోవైపు రాష్ట్ర మంత్రి వర్గంలో చేరాలంటూ టీవీకే నేత అధవ్? అర్జున ఇచ్చిన ఆహ్వానంపై, వీసీకే అధ్యక్షుడు థోల్? తిరుమావలవన్ తనదైన రీతిలో? స్పందించారు. "మేము టీవీకే ఆహ్వానాన్ని గౌరవిస్తున్నాం. మేము ప్రస్తుతం డీఎంకే కూటమిలోనే ఉన్నాం. అయితే మా పార్టీ ఉన్నత స్థాయి కమిటీ సమావేశం జరిగినప్పుడు, చాలా మంది మంత్రివర్గంలో భాగం కావాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మేము పార్టీ కార్యకర్తలతో కూడా చర్చించి, మా నిర్ణయాన్ని ప్రకటిస్తాం" అని అన్నారు.

# నకిలీ సోషల్ మీడియా అకౌంట్స్‌పై ఉక్కుపాదం

రాబోయే నీట్ పునఃపరీక్షను అత్యంత పారదర్శకంగా, సురక్షితంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది.. దీనిలో భాగంగా మంగళవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. కేంద్ర భద్రతా, నిఘా (ఇంటెలిజెన్స్) ఏజెన్సీల ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అత్యున్నత స్థాయి నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పరీక్షను సురక్షితంగా, పటిష్టంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అప్రమత్తతను పెంచాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ధర్మంద్ర ప్రధాన్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యా మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ కూడా పాల్గొన్నారు. ముందుగానే లోపాలను గుర్తించి, సకాలంలో నివారణ, సవరణ చర్యలు తీసుకునేందుకు జరుగుతున్న సన్నాహాలను ఈ సమావేశంలో వివరంగా సమీక్షించారు.

నకిలీ సోషల్ మీడియా నెట్‌వర్క్‌లపై నిఘా

ఈ సమావేశంలో భాగంగా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన మెటా (వీమ్ఖు), గూగుల్ (+శీశీస్త్రశ్రీవ), టెలిగ్రామ్ ప్రతినిధులతో కూడా ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పోటీ పరీక్షల సమయంలో టెలిగ్రామ్ ఛానళు ,, అనామక ఆన్‌లైన్ గ్రూపుల ద్వారా వ్యాపిస్తున్న తప్పుడు సమాచారంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రధాన పరీక్షలకు ముందు ఇలాంటి అనేక ఛానెళ్లు అత్యంత



చురుకుగా మారి, నకిలీ ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలు, క్లిక్‌బైట్ కంటెంట్, ధృవీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులలో భయాందోళనలు, ఆందోళన, గందరగోళాన్ని రేకెత్తిస్తాయని అధికారులు గుర్తించారని తెలిపారు. ఇలాంటి అనేక లింకులు, తప్పుడు సమాచారాన్ని విస్తరింపజేయడానికి రూపొందించిన ఆటోమేటెడ్ బాట్‌లు, నకిలీ గ్రూపులకు వినియోగదారులను మళ్లిస్తున్నాయని వారు స్పష్టం చేశారు.

ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అందించిన సమాచారం ప్రకారం, పరిమిత సంఖ్యలో ఫోన్ నంబర్ల ద్వారా అనేక అనుమానాస్పద ఛానెళ్లు పనిచేస్తున్నాయి. ఇది సమన్వయంతో, వ్యవస్థీకృతంగా జరుగుతున్న కార్యకలాపాలను సూచిస్తోంది.

ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఇలాంటి నెట్‌వర్క్‌లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షలకు ముందు తప్పుడు సమాచారం, ప్రచారం, భయాందోళనలను వ్యాప్తి చేసే ఛానెళ్లను ముందుగానే గుర్తించి, బ్లాక్ చేసి, తొలగించాలని ఆయన సూచించారు.

తప్పుడు సమాచారాన్ని వేగంగా అరికట్టడానికి, పరీక్షా వ్యవస్థ సమగ్రతను కాపాడటానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు విద్యా మంత్రిత్వ శాఖ, ఎన్‌టిఎ, చట్ట అమలు సంస్థలతో సమన్వయంతో పనిచేయాలని మంత్రి నొక్కి చెప్పారు.

తప్పుడు కథనాల నుండి విద్యార్థులను కాపాడటం, పరీక్షా ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత గల అంశమని ధర్మేంద్ర ప్రధాన్ పునరుద్ఘాటించారు.

## ఎరువుల అక్రమాలపై ఉక్కుపాదం

-మొదటిపేజీ తరువాయి

గోదాములు, రవాణా కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వ్యవసాయ శాఖ కమిషనర్ మంజీర్ జిలానీకి మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్, అనధికార విక్రయాలు, పరిశ్రమలకు, ఇతర అవసరాలకు ఎరువుల మళ్లింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. 2026--27 సంవత్సరంలో మే 4వ తేదీ నుండి ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అమలు విభాగం చేపట్టిన కఠిన చర్యలను మంత్రి వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎరువుల డీలర్లకు 182 షోకాజ్ నోటీసులు జారీ చేశారు, 80 ఎరువుల లైసెన్సులను సస్పెండ్ చేశారు, 1 ఎరువుల లైసెన్సును రద్దు చేశారు, సెక్షన్ 6--అ కింద 1 కేసు నమోదు చేశారు, రూ.707 లక్షల విలువైన 3372 మెట్రిక్ టన్నుల ఎరువులను నిర్బంధించారు, రూ.5 లక్షల విలువైన 2 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, రైతులకు అందకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఎరువులను పక్కదారి పట్టించినట్లు రుజువైతే సంబంధిత డీలర్ల లైసెన్సులు వెంటనే రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అంతేకాకుండా, ఈ వ్యవహారాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వ్యవసాయ శాఖ అధికారులపైనా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఒకే జిల్లాలో సంబంధిత అధికారుల పరిధిలో ఎరువుల అమ్మకాల్లో పునరావతంగా అవకతవకలు, నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూస్తే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే సంబంధిత అధికారులను తక్షణమే సస్పెండ్ చేసే అధికారాన్ని జిల్లా జాయింట్ డైరెక్టర్లకు (జేడీలు) అప్పగించినట్లు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తుందని పేర్కొన్నారు. రైతులకు సరైన సమయంలో, సరిపడా పరిమాణంలో నాణ్యమైన ఎరువులు అందేలా జిల్లా వారీగా స్టాక్‌లపై రోజువారీ మానిటరింగ్ నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ నియంత్రణ కోసం విజిలెన్స్ విభాగం, ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బందాల నిఘాను మరింత పెంచుతున్నట్లు తెలిపారు. రైతులను మోసం చేసే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని, రైతుల ప్రయోజనాల రక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని పేర్కొన్నారు.

## మంత్రి కొండపల్లిని కలిసిన ఎస్కేయు ప్రతినిధులు

-మొదటిపేజీ తరువాయి

విద్యాసంస్థలకు సపోర్ట్ చేసిందని వారు మంత్రికి వివరించారు. ఈ ప్రజెంటేషన్‌లో క్లీన్ వాటర్ టెక్నాలజీస్, వ్యర్థాల నిర్వహణ, వ్యవసాయం, పునరుత్పాదక ఇంధనం, బయోమెడికల్ పరికరాలు, ఏఐ ఆధారిత పరిష్కారాలు వంటి రంగాలలో విజయవంతమైన స్టార్టప్‌ల గురించి ప్రత్యేకంగా వివరించారు. అభివద్ధి చెందిన కొన్ని స్టార్టప్‌లు గ్రాంట్లు, పేటెంట్లు, పెట్టుబడులతో పాటు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు పొందాయని వారు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు అందుకున్న, ప్రపంచంలోనే మొట్టమొదటి పూర్తి ఎలక్ట్రిక్ హబ్‌లెస్ సైకిల్‌ను అభివద్ధి చేసిన హెలెన్ బైక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆవిష్కరణను కూడా ఈ బందం ప్రదర్శించింది. దీంతో పాటముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసలు అందుకున్న అవన్ టెక్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అభివద్ధి చేసిన నీటి పొదుపు సాంకేతికతను వారు ప్రదర్శించారు. ఈ నీటి పొదుపు సాంకేతికతను రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయడానికి వీలుగా ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి కొండపల్లి వారికి సూచించారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద సాంకేతికతను మరింతగా ముందుకు తీసుకువెళ్లాలని మంత్రి సూచించారు. వ్యవసాయ వ్యర్థాల ఆధారిత 'బయోడ్రాప్స్' కంపోస్టింగ్ ఎక్కువ మందికి చేరేలా చేయడం కోసం బాపట్లలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలిసి ముందుకు తీసుకెళ్లవచ్చని మంత్రి సూచించారు. అలాగే స్వర్ణాంధ్ర -- వికసిత్ భారత్ 2047 విజన్‌కు అనుగుణంగా స్టార్టప్‌లను బలోపేతం చేయడంలో ఏఐసీ ఎస్కేయూ చేస్తున్న కృషిని మంత్రి కొండపల్లి అభినందించారు.

## హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రారంభం

**-- ఏపీలో టూరిజంకు ఉజ్వల భవిష్యత్**

**-- టెంపుల్ టూరిజమ్, డెస్టినేషన్ వెడ్డింగ్ లకు ప్రాధాన్యత**



**(అంకుశం, అమరావతి, మే 20):** రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి స్టేక్ హోల్డర్స్ అందరూ సహకరించాలని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖామాత్యులు కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. ఏపీ సచివాలయంలోని రెండవ బ్లాక్ లోని సమావేశమందిరంలో టూరిజం అభివద్ధిపై మంత్రి కందుల దుర్గేష్ వర్చువల్ సమావేశంను బుధవారం నిర్వహించారు. ముందుగా హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్ పోస్టర్ ను మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖాధికారులు లాంచనంగా ప్రారంభించారు. ఈ సంరద్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ యుద్ధ వాతావరణ నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ పిలుపులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశంలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించడానికి పర్యాటక శాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని అభివద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ తమ సహకారాన్ని అందించాలని మంత్రి తెలిపారు. డెస్టింగ్ వెడ్డింగ్ లను మన రాష్ట్రంలోనే నిర్వహించుకోవాలని సూచించారు. దీంతో విదేశీమారక నిల్వల ను కాపాడుకోవచ్చన్నారు. మన రాష్ట్రంలో గండికోట, అరకు వ్యాలీ, వైజాగ్, కోనసీమ ఇలా ఎన్నో ప్రకతి అందాలతో అలరారే ప్రాంతాలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రజలను చైతన్యవంతం చేసి పర్యాటక రంగానికి ఊతమిచ్చేందుకు హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమంను ఏడాది పాటు నిర్వహించనున్నామన్నారు. దీంతో ఆయా ప్రాంతాలు పర్యాటకంగా అభివద్ధి చెందటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి, హోటళ్లు, స్టే హోమ్ లు, రవాణా రంగాల వారికి అధిక ఆదాయం లభిస్తుందని వివరించారు. పర్యాటకులకు అద్భుతమైన జ్ఞాపకంగా మిగిల్చే విధంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను తీర్చిదిద్దుతామన్నారు. ఎయిర్ పోర్ట్ టూ ఎయిర్ పోర్ట్ ప్యాకేజీలు కూడా పర్యాటకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తసుకుంటు న్నామన్నారు. పర్యాటకంగా ఏపీ నిలస్తుందనటానికి నిదర్శనమే ఈ ఏడాది టూరిజం ప్రోమోషన్ సిటిగా అవార్డు అందుకోనున్నామని, వచ్చే నెల 4న ఈ అవార్డు అందుకోనున్నామని, ఇది గర్వకారణమని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఇన్ చార్జి ఎండీ పద్మావతి, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, ఈడీ శేషగిరిరావు, స్టేక్ హోల్డర్స్ పాల్గొన్నారు.

# అనంతపురం - మాదాపురం గ్రామానికి ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

## - రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత గారితో కలిసి ప్రారంభించిన పూల నాగరాజు గారు

**అంకుశం న్యూస్, అనంతపురం మే 20:** కడప ఆర్టీసీ రీజనల్ పరిధిలో ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు గారు పేర్కొన్నారు. రాప్తాడు నియోజకవర్గం, రామగిరి మండలం లోని మాదాపురం గ్రామానికి ఏపీఎస్ఆర్టీసీ బస్సును రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత గారితో కలిసి పూల నాగరాజు గారు నేడు ప్రారంభించారు. బస్సును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే పరిటాల సునీత గారితో కలిసి ఆర్టీసీ బస్సులో పూల నాగరాజు గారు ప్రయాణించారు. 20 సంవత్సరాలుగా బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడంపై, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత గారు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, పూల నాగరాజు గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పూల నాగరాజు గారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి సారథ్యంలో ఆర్టీసీ వ్యవస్థ సరైనగాడిలో పడిందన్నారు. మారుమూల పల్లెలకు కూడా ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. స్త్రీ శక్తి, దివ్యాంగ శక్తి పథకాల ద్వారా ప్రభుత్వంపై భారం పడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఆర్టీసీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని పూల నాగరాజు గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కుంటిమద్ది రంగయ్య గారు, మాజీ జడ్పిటిసి సభ్యుడు రామ్మూర్తి నాయుడు గారు, మాజీ ఎంపీపీ పరంధామ యాదవ్ గారు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ .25,97,616

**అంకుశం న్యూస్ , ఉరవకొండ, మే 20 :** ఉరవకొండ మండల పరిధిలోని పెన్నహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం హుండీని బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి జిల్లా దేవాదాయ శాఖ అధికారి గంజి.మల్లికార్జున ప్రసాద్, ఆలయ చైర్మన్ రేగటి నాగరాజు, ఈవో సాకే రమేష్ బాబు ఆధ్వర్యంలో బుధవారం హుండీలను తెరిచి లెక్కించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 36 రోజులుగాను రూ.25,97,616 రూపాయలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానమునకు బ్రహ్మోత్సవాల కాలమందు భక్తాదులు హుండీల యందు సమర్పించిన ముడుపులు, కానుకలకు సంబంధించి హుండీలను తెరచి లెక్కించగా రూ. 25,96,507-00/ మరియు అన్నదానం హుండీ ద్వారా రూ. 1109--00 వచ్చిందని రెండింటి మొత్తం రూ.25,97,616-00 వచ్చిందని తెలిపారు.గత సంవత్సరం రూ. 15,85,888-00 వచ్చిందని గతంతో పోల్చితే ఈ సంవత్సరం రూ.10,11,728-00 ఎక్కువ వచ్చిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మీనుగ రామకృష్ణ, చంద్రమౌళి స్వామి, మంగళ నారాయణప్ప, ధనుంజయ ఆచారి,గుంతకల్లు హనుమాన్ సేవా సంస్థ వారు మరియు భవాని సేవా సమితి అనంతపురం,టీ.డి. పి నాయకులు మోపిడి గోవిందు, ఇంద్రావతి సుధాకర్, బొల్లినేని ఓబులేసు, కురుబ ఎర్రిస్వామి దబ్బర మురళి ,ఉరవకొండ పోలీస్ సిబ్బంది,కెనరా బ్యాంకు ఉరవకొండ సిబ్బంది, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నైపుణ్యాలు పెంపొందించుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలి

- జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్‌లి
- ప్రభుత్వం ద్వారా అందించే నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి
- కందికుంట వెంకట ప్రసాద్, శాసనసభ్యులు, కదిరి.

**అంకుశం న్యూస్ న్యూస్ కదిరి మే 20:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కదిరి లోని ఆర్వీసీ ప్రభుత్వ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ లో ఏర్పాటుచేసిన స్కిల్ హబ్ ని జిల్లా కలెక్టర్ మరియు కదిరి శాసన సభ్యులు కందికుంట వెంకటప్రసాద్ సందర్శించడం జరిగింది. దీనిలో భాగంగా ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ప్రోగ్రాములో సైబర్ సెక్యూరిటీ కోర్సులో శిక్షణ పొందుతున్న యువతీ యువకులతో వారు మాట్లాడారు. దీనిలో భాగంగా స్కిల్ హబ్ లో ఎటువంటి నైపుణ్య శిక్షణలు జరుగుతున్నాయి, వాటికి కావాల్సిన ఇన్ఫ్రాస్ట్రక్చర్ ని పరిశీలించడం జరిగింది. స్కిల్ హబ్ లో ఇప్పటివరకు జరిగిన శిక్షణలు, ఏ ఏ రంగాలలో శిక్షణలో జరిగాయి, వాటి యొక్క ఉపాధి అవకాశాలను పరిశీలించి, యువతకు ఉపయోగపడే విధంగా, ఫ్యూచర్ స్కిల్స్ ఉపాధి అవకాశాలు కల్పించాలని, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారికి ఆదేశించారు. శిక్షణానంతరం వారికి మంచి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. అదేవిధంగా యువతీ యువకులకు ప్రస్తుతం ఉన్నటువంటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మరియు వివిధ రకాల సాఫ్ట్వేర్ కోర్సులపై శిక్షణ ఇవ్వాలని సూచించడం జరిగింది.

ఈ అవకాశాలను ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసినటువంటి స్కిల్ హబ్ లో శిక్షణ పొందేలా యువతీ యువకులను ప్రేరేపించి, వారి నైపుణ్యాలను పెంపొందించి, ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశం కల్పించేలా చేయాలని సూచించారు. శిక్షణ తీసుకుంటున్న వారికీ, వారు శిక్షణ కిట్లను పంపిణీ చేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి స్మిత గారు, మాస్టర్ ట్రైనర్స్, సిబ్బంది పాల్గొన్నారు.





## పిల్లలను ప్రభుత్వబడుల్లో చేర్పించండి



- ఎంపీడీవో చల్లా రాధాకృష్ణ

**అంకుశం న్యూస్ , ఉరవకొండ, మే 20:** ప్రైవేట్ బడులలో చదువులు వద్దు ప్రభుత్వం బడులే ముద్దు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విడపనకల్లు ఎంపీడీవో చల్లా రాదాకృష్ణ పిలుపునిచ్చారు బుధవారం విడపనకల్లు మండల పరిధిలోని కరకముక్కల వేల్పుమ్మడుగు గ్రామాలలో మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జున డిప్యూటీ ఎంపీడీవో సత్యబాబు పరిపాలన అధికారి ఎం భాస్కర్ బాబు లతో కలిసి ప్రభుత్వ బడులలో ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల కన్నా మెరుగైన వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్యా బోధన చేయడానికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు.ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు,నోట్ పుస్తకాలు, యూనిఫాం లతోపాటు మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలకు పంపడం వల్ల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ అభివృద్ధి అధికారులు అబ్దుల్ మునాఫ్, లోకేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీల ఓట్లతో గెలిచి.. వారినే హతమార్చారు

## - వైసీపీపై ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు ఆగ్రహం

**అంకుశం న్యూస్ అనంతపురం మే 20:** ఎస్సీల ఓట్లతో గెలిచి.. వారిపై దాడులు చేసి, హతమార్చిన దుర్మార్గపు పాలన గత ఐదేళ్లలో చూశామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు అన్నారు. వారు బుధవారం రామగిరి మండలం మాదాపురం ఎస్సీ కాలనీ వాసులతో సమావేశమయ్యారు. గత ప్రభుత్వంలో జరిగిన వీధి సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుధాకర్ హత్యలను గుర్తు చేస్తూ.. వారికి ఈ రెండు హత్యలతో పాటు పలు దాడులు, అత్యాచారాల గురించి వారు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత, పూల నాగరాజు మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్సీ వద్ద డ్రైవర్ గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యంని 2022లో ఇదే మే నెలలో హతమార్చారన్నారు. సదరు ఎమ్మెల్సీతో తలెత్తిన వివాదం కారణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేశారన్నారు. పైగా దానిని ప్రమాదంగా నమ్మించే ప్రయత్నం చేశారన్నారు. అలాగే ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్ ని కేవలం మాస్కులు లేవన్న కారణంతో వేధించి వెంటాడి చనిపోయేలా చేశారన్నారు. కరోనా సమయంలో పీపీఈ కిట్లు, మాస్కుల కొరత ఉందని చెప్పారన్న ఉద్దేశ్యంతో సస్పెండ్ చేశారన్నారు. ఆతర్వాత కూడా ఆయన్ని వేధించి అవమానించారన్నారు. ఆ మానసిక వేదనతోనే ఇదే మేనెలలో ఆయన చనిపోయారన్నారు. వైసీపీ పాలనలో ఎవరైనా ప్రశ్నిస్తే.. ఏం చేశారన్న దానికి ఇదే నిదర్శనమన్నారు. కేవలం ఈ రెండు ఘటనలే కాకుండా ఎస్సీలపై అనేక దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు జరిగాయన్నారు. ఎస్సీల ఓట్లతో గెలిచి.. వారిని ఎన్ని ఇబ్బందులు పెట్టారో నేటికీ మరువలేమన్నారు. అందుకే గత ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పారన్నారు.



## హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



**అంకుశం న్యూస్, రాప్తాడు, మే 20:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి జూనియర్ బాయ్స్ పోటీల నిమిత్తం ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు క్రీడాకారుల ఎంపికలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 27, 28, 29 తేదీలలో విజయనగరం జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శివశంకర్ ఆదేశాల మేరకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ రియాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్రీడాకారులు క్రమశిక్షణతో ఆడి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సెలక్షన్స్ లో ఎంపికైన క్రీడాకారులకు రాప్తాడు ఖో-ఖో సీనియర్ ప్లేయర్ చిట్రా ఆదినారాయణ తన సొంత ఖర్చులతో స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. అంతేకాకుండా, రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే ముందు క్రీడాకారులకు నిర్వహించే 5 రోజుల శిక్షణా శిబిరంలో వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కూడా ఆయనే కల్పిస్తున్నట్లు ప్రకటించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఉదారత చాటుకున్న చిట్రా ఆదినారాయణను అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు రవి, పీడీలు మురళి, రాజశేఖర్, అశోక్, వినోద్ మరియు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## విద్యుత్ బస్సుల ను ప్రైవేట్ సంస్థల పరం చేయొద్దు

### ఆర్టీసీ ఎన్ఎంయుఏ యూనియన్ నేతలు డిమాండ్

**అంకుశం న్యూస్, మడకశిర, మే 20:** విద్యుత్ బస్సుల ను ప్రైవేట్ సంస్థల పరం చేయొద్దనీ మడకశిర బసు డిపోలో ఎన్ఎం యుఏ ఆధ్వర్యంలో బ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్ ధర్నాచేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కొత్తగా ప్రవేశపెట్టబోతున్న విద్యుత్ బస్సులను ప్రైవేట్ కంపెనీ లకు ధారా దత్తం చేయకుం డా ఆర్టీసీ ద్వారా గాని లేదా ప్రభుత్వం ద్వారా గాని కొనుగోలు చేయాలని అన్నారు. నిర్వహణ బాధ్యత తీసుకోవాలన్నా రు. ఆర్టీసీ సిబ్బందితోనే విధి విధానా లు నిర్వహించేలా కోరారు. స్త్రీ శక్తి పథకం లో భాగంగా ఇస్తున్న జీరో టికెట్స్ ఇష్యూ చేసే విధానాన్ని వెంటనే నిలుపుదల చేయాలని తెలిపారు. మిగతా వాళ్లకు మాత్రమే టికెట్ ఇచ్చే విధంగా చేసి కండ క్టర్లకు పని భారం తగ్గించా లన్నారు.వీటితోపాటు పిఆ ర్సి కమిటీని వేసి వెంటనే ఐ.ఆర్.చెల్లించాలని చెప్పా రు.పెండింగ్ లో ఉన్న నాలు గు డిఏలు అరియర్స్ తో సహా చెల్లించాలని తెలిపా రు. లీవ్ ఎన్కేష్మెంట్ కూడా ఇవ్వాల్సివంద అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఈ హెచ్ ఎస్ ద్వారా కాకుండా పాత పద్ధతిలోనే ఆర్టీసీ ద్వారా వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ప్రయాణికు లసంఖ్యకుతగ్గట్టుగాబస్సుల సంఖ్య ను కూడా పెంచాలన్నారు. కార్యక్రమంలో డిపో నాయకులు కరియప్ప , రామకృష్ణ ,ముద్దప్ప తదితరులు పాల్గొన్నారు.



## మాతృ మరణాలు శిశు మరణాలు పై సమీక్ష సమావేశం

**అంకుశం న్యూస్, అనంతపురం మే 20:** ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ముఖ్యంగా మాత శిశు సేవలపై శ్రద్ధ వహించి భవిష్యత్తులో జిల్లాలో ఎలాంటి మాత శిశు మరణములు జరగకుండా చూడాలని డాక్టర్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. మాతా శిశు మరణాలపై బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. గర్భవతులకు మరియు బాలింతలకు ప్రభుత్వము నుంచి ఇచ్చు సేవలు పకడ్బందీగా నిర్వహించాలని గ్రామస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి ఆ ఇంటిలో ఉన్న గర్భవతులు గాని బాలింతలు గాని చిన్న పిల్లలకు తగిన పరీక్షలు నిర్వహించి ప్రమాదకరమైన లక్షణములు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యాధికారి వద్దకు తీసుకువెళ్లి పరీక్షలు చేయించచాలని అన్నారు. మందులు ఇప్పించి వాటిని క్రమం తప్పకుండా వాడేలా చూడాలని చెప్పారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ డేవిడ్ సెల్వరాజ్ డిసిహెచ్ ఎస్ డాక్టర్ నవీన్ కుమార్ , మత్తుమందు వైద్యులు, డాక్టర్ దినకర్, చిన్నపిల్లల వైద్యులు, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సౌజన్య ప్రమీల దేవి, హేమలత పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా ఆర్డీటి ఆసుపత్రిలో రక్తదానం




**బత్తలపల్లి,మే 20 అంకుశం న్యూస్ :** యంగ్ టైగర్ జూనీయర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన బత్తలపల్లిలో ఘనంగా నిర్వహించారు. అప్పరాచెరువు గ్రామానికి చెందిన ఆకులేటి భాస్కర అద్వర్యంలో స్థానిక ఆర్డీటి ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు ఆవరణంలో రక్తదానం నిర్వహించారు. ఈ శిబిరంలో సినీ హీరో ఎన్టీఆర్ అభిమానులు భారీగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ రక్తదానం వల్ల తల సేమియా వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయోగపడుతుందని హీరో చేపట్టిన సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా ఈ రక్తదాన శిబిరం నిర్వహించినట్లు అభిమానులు పేర్కొన్నారు. తమ అభిమానంతో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజలు అభినందించారు. ఈ రక్తదానం వల్ల పలువురు ప్రాణాలు నిలబెట్టారని వారిని అభినందించారు. సంబరాలను నిర్వహించారు. ఆకులేటి భాస్కర్,ముసుగు రామచంద్ర,ఆకులేటి తరుణ్ కుమార్, బండి మూర్తి,రాగే విష్ణువర్ధన్, వెంకీ, హరి, యశ్వంత్, భాస్కర్, కార్తీక్, చిన్న రాజు, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

# 21, 22న అనంతపురం జిల్లాలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటన

**అంకుశం న్యూస్, అనంతపురము, మే 20:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు మరియు భూగర్భ శాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర ఈ నెల21, 22 న అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. 21నా సాయంత్రం 6.30 గం.లకు అనంతపురం జిల్లాకు చేరుకుని రాత్రి బస చేసి, 22న కలెక్టరేట్ లో ఉదయం 10 గం.ల నుండి 11:00 వరకు గనులు మరియు భూగర్భ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం, ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 వరకు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్థారని, మధ్యాహ్నం భోజనం అనంతరం 03 గం.ల కు అనంతపురము నుండి రోడ్డు మార్గం ద్వారా బెంగళూరుకు తిరుగు ప్రయాణం అవుతారనీ అనంతపురము జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

– జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్





**అంకుశం న్యూస్, అనంతపురం , మే 20:** వివిధ శాఖల పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల ను వేగవంతం చేసి సకాలంలో వాటిని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ . ఆనంద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఇంజనీరింగ్ అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయా ఇంజనీరింగ్ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ ముఖ్యంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు, అంగన్వాడి భవన నిర్మాణాలు, మూత్రశాలల నిర్మాణం, తాగునీటి వసతి విద్యుత్తు సరఫరా తదితర ఏర్పాట్ల పనులు, గ్రామ సమైక్య భవనాల తదితర నిర్మాణపు పనుల్లో నాణ్యత కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పనులకు సంబంధించిన రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. ఆయా చేసిన పనులకు సంబంధించిన ఫోటోలు సకాలంలో పంపించాలని ఆదేశించారు. కేజీబీవీ లలో జరుగుతున్న పనులు, హెచ్ ఎం ఎస్ ఎస్ ద్వారా జరుగుతున్న లైనింగ్ పనులు, హెల్త్ క్లినిక్ పనులను వేగవంతం చేయాలని పి.ఎం.శ్రీనిధులతో మంజూరు అయిన నిధులతో ఆయా పాఠశాలల్లో పెండింగ్ లేకుండా పనులన్నీ నిర్దేశిత సమయంలో గా పూర్తి చేయాలన్నారు. ఎంపీ నిధులతో చేపట్టిన ఆయా పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని నాబార్డ్ సిఎస్ ఆర్ తదితర నిధులతో చేపట్టాల్సిన పనుల్లో కూడా పెండింగ్ లేకుండా టెండర్స్ పూర్తి చేసి కాంట్రాక్టర్లతో ఒప్పందం ప్రకారం పనులు చేయించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నేషనల్ హైవే రోడ్లు బ్రిడ్జిల నిర్మాణం హెచ్ఎల్సీ మైనర్ ఇరిగేషన్ ఇంజనీరింగ్ పనుల పై ప్రత్యేక దృష్టిని సారించి వాటన్నిటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పూర్తి చేయాలన్నారు. ఆయా పనులకు సంబంధించి గుత్తేదారులతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ నిబంధనల మేరకు అనుకూలమైన ప్రణాళికలతో పనులు పూర్తి చేయాలన్నారు.

పీఎం ఏ జె వై కింద కనేకల్ లో చేపట్టిన వసతి గృహమును జూలై ఆఖరులోగా పూర్తి చేయాలని గుంతకల్ లోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను రెండు రోజుల్లోగా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారికి అప్పగించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే గుత్తేదారుల నుంచి ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు ఆయా నియోజకవర్గ శాసనసభ్యులు తదితర ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా సంప్రదించి వారి అనుమతితో ఆయా సమస్యను పరిష్కరించే విధంగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని పెండింగ్ లేకుండా అన్ని పనులు కూడా నెలలలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల మంజూరు కు సంబంధించి ఇదివరకే పరిపాలనాపరమైన అనుమతులు మరియు నిధులు కూడా మంజూరైన నేపథ్యంలో పనులు పూర్తి చేసే అంశంలో అలసత్వం ప్రదర్శించకుండా నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్సీ సుబ్బారాయుడు, ఆర్ అండ్ బి ఎస్ సి మురళీకృష్ణ, మైనర్ ఇరిగేషన్ ఎస్సీ విశ్వనాథ్ రెడ్డి, సిపిఓ అశోక్, ఏపీ ఈ డబ్ల్యు ఐ డి సి ఈఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలోనే దళితులకు అభివృద్ధి సంక్షేమం అమలు

– టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



**అంకుశం న్యూస్, అనంతపురం మే 20 :** దళిత ద్రోహి జగన్ రెడ్డి అని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు గారు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గారు తెలిపారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో రౌడీ మూకలు దళితులపై రెచ్చిపోయి దాడులకు పాల్పడ్డారన్నారు. అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గారు, తెలుగుదేశం పార్టీ ఎస్సీ నాయకులతో కలిసి పూల నాగరాజు గారు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూల నాగరాజు గారు, బండారు శ్రావణి శ్రీ గారు మాట్లాడుతూ జగన్ రెడ్డి నా ఎస్సీలు, నా ఎస్టీలు, అంటూ నమ్మించి దళితుల గొంతు కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ఐదేళ్లపాలనలో 220 మంది దళితులను దారుణంగా హతమార్చారని తెలిపారు. జగన్ రెడ్డి చేసిన తన ఐదేళ్ల పాలనలో 637 మంది దళిత మహిళలపై అత్యాచారాలు జరిగాయని, 56,981 మంది దళితులపై దాడులు జరిగాయని, 11,000 వేల ఎకరాల దళిత భూములను బలవంతంగా లాక్కున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వ హయాంలో దళితులను ఎంతగా ఊచకోత కోశారో దళిత డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ అచ్చెన్న ఘటనలే సాక్ష్యాలని పేర్కొన్నారు. జగన్ పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగాయని స్వయంగా రాజ్యసభలో కేంద్రం లెక్కలతో సహా వివరించిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ. 27,000కోట్లు, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ. 5,000 కోట్లు మొత్తం రూ. 33వేల కోట్లను దారి మళ్లించి దళితులకు అన్యాయం చేశారన్నారు. దీంతో లక్షలాదిమంది దళిత సోదరులు కోట్లాది రూపాయల బ్యాంకు సబ్సిడీ లోన్లు కోల్పోవలసి వచ్చిందన్నారు. ప్రజలు ఎన్నికల్లో వైసిపికి కేవలం 11 సీట్లకు పరిమితం చేసి శిక్షించినా జగన్ తీరు మారలేదన్నారు. 2029లో కూతమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు, మంత్రి నారా లోకేష్ గారి సారధ్యంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. వైసిపి నాయకులు ఎన్ని డ్రామాలాడిన దళితులు జగన్ రెడ్డిని నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు సాకే లక్ష్మీనరసింహ, వన్నూరప్ప, భూలక్ష్మి, సుధీర్, శివ, వెంకటసుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# ఖైరతాబాద్ నియోజకవర్గంలో బస్తీవాసుల దుస్థితి దారుణం

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మండిపడ్డ ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు

ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందాలో మునిగిపోయిన మున్సిపల్ మంత్రి రేవంత్ రెడ్డి. ఎప్పుడు పదవి ఊడిపోతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్;

ప్రజా సమస్యలు పూర్తిగా గాలికి.ప్రకటనలకే పరిమితమైన "తెలంగాణ రైజింగ్"

సమస్యలు పరిష్కరించకుంటే జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం



**హైదరాబాద్:** నగర నడిబొడ్డున, అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాంతంగా చెప్పుకునే ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్ పరిధిలో బస్తీవాసులు నరకయాతన అనుభవిస్తున్నారని, కనీస మౌలిక వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్ డివిజన్ నాయకులు జేజోళ్ల రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో, శ్రీరామ్ నగర్ మరియు అంబేద్కర్ నగర్ బస్తీలకు చెందిన స్థానిక నాయకులు ఎండ్. అక్తర్, రమేష్, బస్వ గౌడ్, రాములు, శశికల సమక్షంలో ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు ఆయా బస్తీలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, వారి ఆవేదనను ఆలకించారు. ప్రభుత్వ పెద్దలు, స్థానిక ఎమ్మెల్యేపై డా. శ్రవణ్ దాసోజు పదునైన విమర్శలు:మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్థానిక నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు:రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ దందా: "రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి అయిన రేవంత్ రెడ్డి బస్తీల అభివృద్ధిని వదిలేసి, 'ఫ్యూచర్ సిటీ' పేరు మీద రియల్ ఎస్టేట్ దందాలో మునిగిపోయారు. ఆయనకు రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాలపై లేదు. "బిక్కుబిక్కు మంటున్న ఎమ్మెల్యే దానం నాగేందర్: "ఇక స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయానికి వస్తే... ఫిరాయింపుల నేపథ్యం లో తన ఎమ్మెల్యే పదవి ఎప్పుడు ఊడిపోతుందో అనే భయంతో ఆయన బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తన పదవిని కాపాడుకునే ఆరాటంలో పడి ప్రజలను, ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించారు. ఫలితంగా ఖైరతాబాద్ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు."

## పెట్రోల్ ధరలపై వైసీపీ వ్యాఖ్యలు సిగ్గు చేటు

– అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి



**అంకుశం న్యూస్, అనంతపురం మే 20:** పెట్రోల్, డీజిల్ ధరలపై వైసీపీ నేతలు చేస్తున్న డ్రామాలు ప్రజలు నవ్వుకుంటున్నారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గత కొన్ని రోజులుగా ఇంధన ధరల విషయంలో వైసీపీ చేస్తున్న నిరసనలు, చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. అసలు వైసీపీ నాయకులవి నిరసనలుగా ఎవరూ భావించడం లేదని.. అది ఒక పొలిటికల్ డ్రామాగా చూస్తున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే పన్నుల భారం వల్ల ఇంధన ధరలు ఆకాశాన్నంటాయని, తాము అధికారంలోకి వచ్చాక పన్నులు పెంచలేదని స్పష్టం చేసింది. వైసీపీ పాలనలో ఏపీలో లీటరు పెట్రోల్ ధర రూ. 111 దాటిందని అదే పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడులో దీనికంటే చాలా తక్కువ ధరకు లభించిందని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు మీరే ఆందోళన చేయడం చేస్తారా అంటూ మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు అవుతుందని.. ఈ సమయంలో పెట్రోల్, డీజిల్‌పై తాము నయాపైసా పెంచలేదన్నారు. గతంలో మీ ప్రభుత్వం పెంచిన ధరలపై మీరే ఆందోళన చేయడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారనే విషయాన్ని తెలుసుకోవాలని సూచించారు. మీ ప్రభుత్వ హయాంలో లిక్కర్ ధరలు పెంచడమే కాకుండా.. నకిలీ మద్యం ఇచ్చి వేలాది మంది ప్రజల ప్రాణాలు తీశారని.. ఆ విషయాల్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. వైసిపి నేతలు సైకిళ్లు తొక్కడం, ఎడ్ల బండ్లు, ఆటోలను తాళ్లతో లాగడం వంటి నిరసనలు చూస్తుంటే.. మీవి డ్రామాలన్నది అందరికీ తెలిసిపోతోందన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను దాచి.. ప్రజల్ని మభ్య పెట్టే ప్రయత్నం మానుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హితవు పలికారు..

## పైప్ లైన్ లీకేజీ తో వృధాగా తాగునీరు



**అంకుశం న్యూస్,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మే 20:** అనపర్తి పాత ఊరులో విలేకరి సత్తి వెంకటరెడ్డి ఇంటి సమీపంలో (శ్రీ రామ్ రెడ్డి టాక్స్ కన్సల్టెన్సీ) వద్ద పంచాయితీ పైప్ లైన్ లీక్ కావడంతో నీరు వృధాగా పోవడమే కాకుండా అక్కడ బురదమయంగా తయారౌతుంది. ఇక్కడ పైప్ లైన్ లీక్ గమనించి సుమారు నెల క్రితం మరమ్మతు పనులు చేయకుండా "మసిపూసి మారేడుకాయ" చేసినట్టు కేవలం లీకేజీ వద్ద మట్టి కప్పి వదిలేయడంతో ఆ లీకేజీ నుండి(ఉదయం,సాయంత్రం) నీరు పైకి రావడం జరుగుతుంది. సైడ్ కి కాకుండా ఒక పక్క(రోడ్డు మధ్య) నుండి మరో పక్కకు ఉండటంతో రోడ్డు కూడా అధ్వానంగా తయారౌతుంది. ఒకపక్క ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రభుత్వ సొమ్మును పొదుపు చేయడమే కాకుండా ఎలా చేయాలో చేసిచూపెడుతుంటే పంచాయతీ అధికారులు, సిబ్బంది మాత్రం ఏమీ పట్టించుకోవడం లేదు ఇప్పటికైనా పంచాయతీ అధికారులు తగుచర్యలు చేపట్టి నీరు వృధా కాకుండా కాపాడటమే కాకుండా రోడ్డు అధ్వానంగా తయారయ్యే పరిస్థితి నుండి కాపాడి ప్రజలసొమ్ము పొదుపు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అసైన్డ్ భూమి సాగు పట్టాలపై గ్రామసభ





**అంకుశం న్యూస్, అనంతపురం, మే 20:** అసైన్డ్ భూమి సాగు పట్టాల ఎంపిక జాబితా తయారీపై బుధవారం కూడేరు మండలంలోని మరుట్ల గ్రామంలో ఉన్న రెండవ కాలనీలో రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. గ్రామసభలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అసైన్డ్ భూమిలో సాగులో అర్హత ఉన్న ప్రతి నిరుపేదకు పట్టా ఇస్తామని తెలిపారు. అసైన్ భూమికి సాగు పట్టాలు ఇవ్వాలని పలువురు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చుకున్నారు, వాటిపైన రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపారు, అర్హత ఉన్న వారి జాబితాను తయారు చేశారు. ఇందులో 47 మంది అర్హులుగా గుర్తించడం జరిగింది. అర్హత ఉండి ఇంకా జాబితాలో పేర్లు లేకపోయినా విచారణ జరిపి వారిని కూడా జాబితాలో చేరుస్తామని, ప్రభుత్వం తరపున పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతరం ఆర్డీఓ కేశవ నాయుడు, తహసీల్దారు ఉదయభాస్కర్, మండల సర్వేయర్ అయేషా సిద్ధికి, విఆర్వో శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యూత్ లీడర్షిప్ సదస్సు

**నిర్మల్ :** "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక శిక్షణ కేంద్రం (ఐటిఐ) లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. "యూత్ లీడర్ షిప్ సమ్మిట్" అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలువురు అధికారులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, దేశ రాజకీయాల్లో యువత పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. యువజన, క్రీడల శాఖ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మిట్ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఐటీఐ కన్వీనర్ కోటిరెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.